
పాఠం
15

# వలస పాలిత ప్రాంతాలలో జాతి విముక్తి ఉద్యమాలు

వలసపాలిత ప్రాంతాలను సూచించే కింది పటాన్ని చూడండి. 19వ శతాబ్దం నాటికి లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాలపై ఐరోపా దేశాలు నియంత్రణ పొందిన విధానాన్ని మీరు ఎనిమిదవ తరగతిలో చదివారు. ఈ దేశాలు తమ స్వాతంత్ర్యం కోసం పోరాడిన విధానాల గురించి ఈ అధ్యాయంలో తెలుసుకుందాం. కింది పటంలో బ్రిటన్ వలసపాలిత ప్రాంతాలు ఊదా రంగులనూ, ఫ్రాన్స్‌కి చెందినవి నీలం రంగులోనూ, హాలెండ్‌కి చెందినవి లేతగోధుమ రంగులోనూ ఉన్నాయి. ఆసియా, ఆఫ్రికాలలో కొన్ని దేశాలు స్వతంత్రంగానే ఉన్నాయి, ఇవి బూడిద రంగులో ఉన్నాయి. ఆధునిక ప్రపంచ పటంలో ఈ దేశాలన్నింటినీ గుర్తించండి.

- బ్రిటన్‌కి చెందిన వలసలలో ఆసియాలో ఒక ప్రాంతాన్ని, ఆఫ్రికాలో మరొక ప్రాంతాన్ని గుర్తించండి.
- హాలాండ్‌కి చెందిన ఒక ఆసియా, ఒక ఆఫ్రికా వలస ప్రాంతాన్ని గుర్తించండి.
- ఫ్రాన్స్‌కి చెందిన ఒక ఆసియా, ఒక ఆఫ్రికా వలస ప్రాంతాన్ని గుర్తించండి.
- ఏ దేశానికి వలసపాలిత ప్రాంతంగాలేని ఆసియాలో రెండు దేశాలను, ఆఫ్రికాలో ఒక దేశాన్ని గుర్తించండి.
- ఆస్ట్రేలియా ఏ దేశానికి వలసపాలిత ప్రాంతంగా ఉంది?



*పటం 1 : 1914లో వలసపాలిత ప్రాంతాలు*

స్వతంత్ర దేశాలైన చైనావంటివి వాస్తవానికి అనేక వలసపాలక దేశాల నియంత్రణలో ఉండి పేరుకి మాత్రమే స్వతంత్రంగా ఉన్నాయి. ఈ అధ్యాయంలో వలసపాలిత ప్రాంతాల దారుణ పరిస్థితుల గురించి, ఐరోపా దేశాల వలస పెత్తనానికి వ్యతిరేకంగా వాళ్ల పోరాటాల గురించి చదువుదాం. ఈ దేశాలలో చాలా వాటిల్లో అనేక భాషలు, అనేక మతాలు ఉన్న వివిధ రకాల ప్రజలు ఉండేవాళ్లు. వీళ్లందరికీ తాము అంతా ఒక జాతి అన్న భావన అంతగా ఉండేది కాదు. ఈ ప్రాంతాలలో సాంప్రదాయ పాలకులుగా ఉన్న రాజులు, చక్రవర్తులు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ వంటి భావనలకు అంతగా మద్దతు పలికేవాళ్లు కాదు. కొత్త ఉద్యమాలు చోటుచేసు కోవటంతో యూరపులో వ్యాప్తిలో ఉన్న జాతీయతావాదం, ప్రజాస్వామ్యం, చివరికి సోషలిజం వంటి కొత్త భావనలతో ప్రజలు స్ఫూర్తి పొందసాగారు. కొన్ని దేశాలలోని అనుభవాలను, వలసపాలిత ప్రాంతాల లక్షలాది ప్రజల జీవితాలలో మార్పును అర్థం చేసుకోటానికి వీటిని మన దేశంలోని అనుభవాలతో పోల్చి చూద్దాం.

- జాతీయతా భావం అంటే ఏమిటో, అది ఎలా రూపుదిద్దుకుందో అర్థం చేసుకోటానికి 9వ తరగతి పాఠ్యపుస్తకాన్ని మరొకసారి చదవండి.
- ఆయాదేశాల సాంప్రదాయ పాలకులు స్వాతంత్ర్యం కోసం పోరాడి ఉండి ఉంటే ఎటువంటి రాజకీయ వ్యవస్థలు ఏర్పడి ఉండేవి?
- వలసపాలిత ప్రాంతాలలో ఏ సామాజిక వర్గాలు స్వాతంత్ర్యం కోసం పోరాడాయి? సమానత్వం, ప్రజాస్వామ్యం అన్న భావనలు వాళ్ళకు ఎందుకు ముఖ్యం అయ్యాయి?

## చైనా : రెండు భిన్న దశలు

20వ శతాబ్దం ఆరంభంలో మంచూ వంశ చక్రవర్తులు చైనాని పాలిస్తూ ఉండేవాళ్లు. అయితే పాశ్చాత్య వలసపాలక శక్తులనుంచి చైనా ప్రయోజనాలను కాపాడగలిగే పరిస్థితిలో వాళ్లు లేరు. ఈ వలస పాలక శక్తులు చైనాలోని వివిధ ప్రాంతాలలో తమ 'ప్రాభవ ప్రాంతాలను' ఏర్పరచుకుని తక్కువ దిగుమతి పన్నులు చెల్లించడం, చైనా చట్టాలు తమకు వర్తించకపోవటం, సైనిక దళాలను కలిగి ఉండటం వంటి మినహాయింపులను ఇచ్చేలా చైనా చక్రవర్తులపై ఒత్తిడి తేగలిగారు. ఈ పరిస్థితుల పట్ల చైనాలోని పాలనాధికారులు, ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ప్రజలు అనేక తిరుగుబాట్లు చేశారు. పాలనాధికారులు అనేక సంస్కరణలకు ప్రయత్నించారు.

### గణతంత్రం ఏర్పాటు

మంచూ సామ్రాజ్యాన్ని కూలదోసి సన్‌యెట్-సెన్ (1866-1925) తన నేతృత్వంలో 1911లో గణతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేశాడు. సన్‌యెట్-సెన్‌ని ఆధునిక చైనా నిర్మాతగా పరిగణిస్తారు. అతడు పేద కుటుంబానికి చెందినవాడు. అతడు చదివిన మిషనరీ పాఠశాలల్లో క్రైస్తవ మతంతోటి, ప్రజాస్వామ్య భావనలతోటి ప్రభావితం అయ్యాడు. అతడు వైద్యశాస్త్రాన్ని అభ్యసించాడు కానీ చైనా భవిష్యత్తు పట్ల ఎంతో ఆందోళన పడేవాడు. చైనా సమస్యలను అధ్యయనం చేసి ఒక కార్యాచరణ పథకాన్ని రూపొందించాడు. అతడి కార్యక్రమాన్ని 'మూడు సిద్ధాంతాలు' అంటారు (సన్, మిన్, చుయి). ఇవి ఏవనగా "జాతీయతావాదం"- అంటే విదేశీ పాలకులుగా భావింపబడుతున్న మంచూ వంశాన్ని, ఇతర విదేశీ సామ్రాజ్యవాద శక్తులను పారదోలటం; "ప్రజాస్వామ్యం"- అంటే ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం; "సామ్యవాదం"- అంటే పరిశ్రమలపై నియంత్రణ, భూమిలేని రైతాంగానికి భూమిని పంచటానికి భూ సంస్కరణలు. మంచూ వంశాన్ని తొలగించి గణతంత్రాన్ని ప్రకటించినప్పటికీ, సన్ నాయకత్వంలోని గణతంత్ర ప్రభుత్వం స్థిరపడలేకపోయింది. 'యుద్ధ ప్రభువులు' అని పిలవబడే స్థానిక సైనిక శక్తుల నియంత్రణలో దేశం ఉంది.


సామాజిక, రాజకీయ అనిశ్చితి కొనసాగింది. వర్సయిల్స్‌శాంతి సమావేశం నిర్ణయాలను నిరసిస్తూ 1919 మే 4న బీజింగ్‌లో ఒక నిరసన ప్రదర్శన చేపట్టారు. మొదటి ప్రపంచ యుద్ధంలో గెలుపొందిన బ్రిటన్ పక్షాన ఉన్నప్పటికీ జపాను ఆక్రమించిన ప్రాంతాలు చైనాకి తిరిగి రాలేదు. ఈ నిరసన ఒక ఉద్యమంగా రూపొంది 'మే నాలుగు ఉద్యమం'గా పిలవబడసాగింది. పాత సాంప్రదాయాలను తిరస్కరించి ఆధునిక విజ్ఞానశాస్త్రం, ప్రజాస్వామ్యం, జాతీయతావాదం ద్వారా చైనా ముందుకు వెళ్లాలని ఒక తరం ఉద్యమించింది. దేశ వనరులను నియంత్రిస్తున్న విదేశీయులను తరిమెయ్యాలని, పేదరికాన్ని తగ్గించి, అసమానతలను తగ్గించాలని విప్లవకారులు కోరసాగారు. సాధారణ భాష, లిపిలను అనుసరించడం, మహిళల పరాధీనత, ఆడపిల్లల పాదాలు కట్టివెయ్యటం (ఆడపిల్లల పాదాలు పూర్తిగా పెరగకుండా నిరోధించే క్రూరమైన సాంప్రదాయం) వంటి వాటిని వ్యతిరేకించటం, వివాహంలో సమానత్వం, పేదరికాన్ని అంతం చెయ్యటానికి ఆర్థిక అభివృద్ధి వంటి సంస్కరణలను వాళ్లు ప్రతిపాదించారు.



చిత్రం 15.1 : మే నాలుగు ఉద్యమంలో ప్రజల నిరసన

- యువ చైనీయులు పాత సాంప్రదాయాలను, విదేశీ శక్తులను ఎందుకు వ్యతిరేకించసాగారు?
- ఇటువంటిది ఏమైనా భారతదేశంలో జరిగిందా?

గణతంత్ర విప్లవం తరువాత దేశం ఒక సంక్షోభ స్థితిలోకి నెట్టబడింది. దేశాన్ని ఐక్యం చెయ్యటానికి, సుస్థిరత సాధించటానికి కృషి చేసే ప్రధాన శక్తులుగా గుయోమిండాంగ్ (జాతీయ ప్రజాపార్టీ, దీనినే కెఎంటి అనేవాళ్లు), చైనా కమ్యూనిస్టు పార్టీ (సిసిపి) ఆవిర్భవించాయి. గుయోమిండాంగ్ రాజకీయ సిద్ధాంతానికి సన్‌యెట్ –సెన్ భావనలు ఆధారమయ్యాయి. కూడు, గుడ్డ, ఇల్లు, రవాణా అన్నవి 'నాలుగు ప్రధాన అవసరాలు'గా వాళ్లు గుర్తించారు. సన్‌యెట్ –సెన్ చనిపోయిన తరువాత గుయోమిండాంగ్ నాయకుడిగా చియాంగ్ కైషేక్ (1887–1975) ఎన్నికయ్యాడు. అధికారాన్ని హస్తగతం చేసుకున్న 'యుద్ధ ప్రభువుల'కు, స్థానిక నాయకులకు వ్యతిరేకంగానూ, కమ్యూనిస్టులను నిర్మూలించటానికీ అతడు సైనిక చర్యకు పూనుకున్నాడు. దేశాన్ని సైనిక దేశంగా మలచటానికి అతడు ప్రయత్నించాడు. ప్రజలు 'కలిసి పనిచేసే' సహజాత అలవాటుని పెంపొందించుకోవాలని అతడు కోరాడు.




చిత్రం 15.2 : ఆ తరువాతి కాలంలోని గోడ పత్రిక : 'పాత ప్రపంచాన్ని కూలగొట్టు, కొత్త ప్రపంచాన్ని నిర్మించు'అని ఇది పేర్కొంటోంది.

గుయోమిండాంగ్ సామాజిక మూలాలు పట్టణ ప్రాంతాలలో ఉన్నాయి. పారిశ్రామిక ప్రగతి పరిమితంగానూ, నిదానంగానూ ఉంది. ఆధునిక ప్రగతికి కేంద్రాలుగా మారిన షాంఘై వంటి నగరాలలో

1919 నాటికి 5 లక్షల పారిశ్రామిక కార్మిక వర్గం ఏర్పడింది. అయితే వీళ్లల్లో చాలా తక్కువ శాతం ఓడల నిర్మాణం వంటి ఆధునిక పరిశ్రమలలో ఉపాధి పొందారు. వీరిలో అధిక శాతం 'మధ్యతరగతి పట్టణవాసులు' (సియావో షిమిన్)గా పరిగణింపబడే వ్యాపారస్తులు, దుకాణదారులు ఉన్నారు. పట్టణ కార్మికులకు, ప్రత్యేకించి మహిళలకు చాలా తక్కువ వేతనాలు లభించేవి. వాళ్లు కార్మిక సంఘాలలో సంఘటితం కాసాగారు. పని గంటలు సుదీర్ఘంగా ఉండటమే కాకుండా పని పరిస్థితులు చాలా దారుణంగా ఉండేవి. స్వేచ్ఛా భావనలు ఆదరణ పొందటంతో మహిళల హక్కుల గురించి, సమానత్వం పునాదిపై కుటుంబాలను నిర్మించటం, ప్రేమ వంటి వాటి గురించి ఆలోచించటం, చర్చించటం మొదలుపెట్టారు. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు విస్తరించటంతో (పెకింగ్ విశ్వవిద్యాలయం 1902లో ఏర్పడింది) సామాజిక, సాంస్కృతిక మార్పులకు ఊతం లభించింది. ఈ కొత్త ఆలోచనల పట్ల పెరుగుతున్న ఆకర్షణను సూచిస్తూ జర్నలిజం విలసిల్లింది.

- ఈ కాలంలో ఆవిర్భవించిన ముఖ్యమైన రాజకీయ పార్టీలు ఏమి?
- ఇటువంటి సమీకరణల్లో సభ్యులు ఎవరు?
- వాళ్లు ఆశించిన సామాజిక, ఆర్థిక మార్పుల స్వరూపం ఏమిటి?

చియాంగ్ సాంప్రదాయవాది. మహిళల పాత్ర ఇంటికి పరిమితమై ఉందని, 'పాతివ్రత్యం, రూపం, మాట, పని' అన్న నాలుగు సుగుణాలపై వాళ్లు శ్రద్ధ పెట్టాలని అతడు భావించేవాడు. ఆడవాళ్లు ధరించే గౌనులు ఎంత పొడవు ఉండాలన్నది కూడా సిఫారసు చెయ్యసాగారు. ఫ్యాక్టరీ యజమానులకు ప్రోత్సాహకంగా కార్మిక సంఘాలను అణిచివెయ్యటానికి కూడా అతడు పూనుకున్నాడు. గుయోమిండాంగ్ పార్టీ తన సంకుచిత సామాజికతత్వం వలన, రాజకీయ దూరదృష్టి లోపించడం వలన దేశంలో ఏకత్వం సాధించడంలో విఫలమైంది. సన్‌యెట్-సెన్ కార్యక్రమం లోని ప్రధాన అంశమైన పెట్టుబడి నియంత్రణ, భూమి సమాన పంపిణీ అన్న వాటిని అమలు చెయ్యనే లేదు. పెరుగుతున్న సామాజిక అసమానతలను, రైతాంగాన్ని పార్టీ పట్టించుకోలేదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటానికి బదులు సైన్యంతో శాంతిభద్రతలను కల్పించటానికి ప్రయత్నించారు.

## చైనా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం

1937లో చైనాపై జపాను దండెత్తినప్పుడు గుయోమిండాంగ్ వెనకడుగు వేసింది. సుదీర్ఘ యుద్ధం వల్ల చైనా బలహీనపడింది. 1945-1949 మధ్యకాలంలో ధరలు నెలకి 30 శాతం చొప్పున పెరిగాయి, దీంతో సాధారణ ప్రజల జీవితాలు దుర్భరమయ్యాయి. గ్రామీణ చైనా రెండు సంక్షోభాలను ఎదుర్కొంది: మొదటిది నేలలు నిస్సారం కావటం, అడవులు నరికివెయ్యటం, వరదల వంటి జీవావరణ పరమైనది. రెండవది దోపిడీపూరిత భూమి కౌలు విధానాలు, రుణ భారం, పురాతన సాంకేతిక విజ్ఞానం, అభివృద్ధి చెందని ప్రసార మాధ్యమాలతో కూడిన సామాజిక - ఆర్థిక పరమైనది.

రష్యా విప్లవం తరువాత కొద్దికాలానికే 1921లో చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. రష్యా సాధించిన విజయం ప్రపంచంపై బలమైన ప్రభావాన్ని చూపింది. దోపిడీని అంతంచేసే ప్రపంచ ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యటానికి దోహదపడే కొమిన్‌టర్న్‌ని లెనిన్ వంటి నాయకులు 1918 మార్చిలో స్థాపించారు. వివిధ దేశాలలోని కమ్యూనిస్టు పార్టీలకు సోవియట్ యూనియన్, కొమిన్‌టర్న్ మద్దతు ఇచ్చాయి. అయితే, పట్టణాలలోని శ్రామిక వర్గం ద్వారానే విప్లవం వస్తుందన్న సాంప్రదాయ మార్క్సిస్టు అవగాహనతోనే అవి పనిచేయసాగాయి. సిసిపి నాయకుడిగా ఎదిగిన మావో జెడాంగ్ (1893-1976) తన విప్లవ కార్యక్రమానికి రైతాంగాన్ని ఆధారంగా చేసుకుని భిన్నమైన పంథాని అవలంబించసాగాడు. భూస్వామ్యాన్ని అంతం చెయ్యటానికి పోరాడేలా అతడు చైనా రైతాంగాన్ని సంఘటితం చేస్తూ రైతాంగ సైన్యాన్ని నిర్మించసాగాడు. సిసిపి నాయకత్వంలోని పోరాటంలో భూమిలేని రైతాంగం లక్షలాదిగా

చేరసాగారు. అతడి విజయాలు సిసిపిని బలమైన రాజకీయ శక్తిగా రూపొందించి, అంతిమంగా గుయోమిండాంగ్‌పై విజయం సాధించేలా చేశాయి. గుయోమిండాంగ్ దాడుల నుంచి రక్షణనిచ్చే జియాంగ్‌క్సి పర్వతాలలో 1928 నుంచి 1934 వరకు బస చెయ్యటం మావో జెడాంగ్ భిన్నమైన పంథాని సూచిస్తుంది. భూస్వాముల భూమిని స్వాధీనం చేసుకుని పునః పంపిణీ చెయ్యటం ద్వారా బలమైన రైతాంగ సంఘాలను (సోవియట్లను) నిర్మించాడు. ఇతర నాయకుల లాగా కాకుండా స్వతంత్రంగా ఉండే ప్రభుత్వం, సైన్యాలను మావో నిర్మించాడు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గ్రామీణ మహిళాసంఘాల ఏర్పాటును ప్రోత్సహించాడు. పెద్దలు కుదిర్చిన వివాహాలను నిషేధిస్తూ, వివాహ ఒప్పంద పత్రాల కొనుగోలు, అమ్మకాలను నిలిపివేస్తూ, విడాకుల విధానాన్ని సరళీకృతం చేస్తూ కొత్త వివాహ చట్టాన్ని చేశారు.



*చిత్రం 15.3 : 1944లో యానాన్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న మావో*

కమ్యూనిస్టుల సోవియట్లను గుయోమిండాంగ్ చక్రబంధం చెయ్యటంతో పార్టీ తమ స్థావరాన్ని మార్చుకోవలసి వచ్చింది. దీంతో 'లాంగ్ మార్చ్'గా ప్రఖ్యాతిగాంచిన షాంక్సికి 6000 మైళ్ల కష్టభూయిష్ట ప్రయాణం (1934-35) మొదలయ్యింది. ఇక్కడ యానాన్‌లోని తమ కొత్త స్థావరంలో యుద్ధ ప్రభువులను అంతమొందించి, విదేశీ సామ్రాజ్యవాదంపై పోరాడటానికి, భూసంస్కరణలు చేపట్టటానికి తమ కార్యక్రమాన్ని మరింత తీవ్రతరం చేశారు. భూ సంస్కరణలు, జాతీయకరణ అన్న ఈ రెండు అంశాల కారణంగా పార్టీకి బలమైన సామాజిక పునాది ఏర్పడింది.

1937-1945 మధ్యకాలంలో చైనాపై జపాను దండెత్తి చాలా భూభాగాన్ని ఆక్రమించింది. క్రూర, వలస, సైనిక పాలనను జపాను అమలు చెయ్యటంతో చైనా సమాజం, ఆర్థిక పరిస్థితి దారుణంగా ప్రభావితమయ్యాయి. జపాను ఆక్రమణను ప్రతిఘటించటానికి గుయోమిండాంగ్, సిసిపి చేతులు కలిపాయి. 1945 ఆగస్టులో అమెరికాకి జపాన్ దాసోహం అయిన తరువాత చైనాపై ఆధిపత్యం కోసం గుయోమిండాంగ్, సిసిపిల మధ్య పూర్తిస్థాయి యుద్ధం జరిగింది. అంతిమంగా చైనా ప్రధాన భూభాగంపై పట్టు సాధించటంలో సిసిపి విజయమయ్యింది. గుయోమిండాంగ్‌కి తైవాన్ దీవిలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే పరిస్థితి కలిగింది.

## నూతన ప్రజాస్వామ్యం ఏర్పాటు : 1949-1954

1949లో చైనా ప్రజల గణతంత్రం ఏర్పడింది. ఇది 'నూతన ప్రజాస్వామ్యం' అన్న సిద్ధాంతంపై ఏర్పడింది. భూస్వామ్య విధానాన్ని, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే సామాజిక వర్గాలన్నీ ఈ సిద్ధాంతం ఆధారంగా ఏకమయ్యాయి. ఆర్థిక విధానంలోని కీలకాంశాలను ప్రభుత్వ ఆధీనంలో ఉంచారు. అధికారంలోకి వచ్చిన తరువాత సిసిపి పెద్ద ఎత్తున భూ సంస్కరణలు అమలు చేసింది - అంటే భూస్వాముల భూమిని జప్తు చేసి పేద రైతాంగానికి పంచిపెట్టారు. మహిళల రక్షణకు, వాళ్ల హక్కులకు, బహు భార్యత్వ నిషేధానికి కూడా కొత్త ప్రభుత్వం చట్టాలుచేసింది. దీనివల్ల మహిళలు వివిధ రంగాలలో పురుషులతో సమాన హోదా పొందగలిగారు.

## భూ సంస్కరణలు

గ్రామీణ పరిస్థితిని అర్థం చేసుకోవటం, రైతాంగ సంఘాల నిర్మాణం వంటి వాటితో రెండు సంవత్సరాలు శాంతియుతంగా గడిచిన తరువాత 1950-51లో భూ సంస్కరణల అమలు మొదలుపెట్టారు. గ్రామాలలో ఉంటున్న అందరి వర్గాలను గుర్తించటం, తరువాత భూస్వాముల భూమి, ఇతర ఉత్పాదక ఆస్తులను స్వాధీనం చేసుకుని తిరిగి పంచటం వంటివి దీంట్లో ముఖ్యమైన దశలు. ఈ ప్రక్రియలో ప్రధాన భూమికను "ప్రాంత స్థాయి భూ సంస్కరణల సంఘం" పంపించిన పని బృందాలు పోషించాయి. రైతాంగ సంఘాలను ఏర్పాటు చెయ్యటం, స్థానిక నాయకత్వ స్థానాలకు వాటినుంచి క్రియాశీలక సభ్యులను ఎంపిక చెయ్యటం వీటి ముఖ్య విధుల్లో భాగంగా ఉండేది. ఈ కొత్త నాయకత్వం ప్రధానంగా పేద, మధ్యతరగతి రైతాంగం నుంచి ఏర్పడింది. పలు ప్రాంతాలలో తమ నైపుణ్యాల కారణంగా మధ్యతరగతి రైతాంగం ఆధిపత్యంలోకి వచ్చింది. అంతేకాకుండా ప్రజా సమావేశాలు, బహిరంగ విచారణల ద్వారా భూస్వాములకు వ్యతిరేకంగా గ్రామం అంతటిని సమీకరించటానికి పని బృందాలు ప్రయత్నించాయి.



*చిత్రం 15.4 : భూమి రికార్డులను తగలబెడుతున్న ప్రజలు*

ఈ పద్ధతుల వల్ల భూస్వాములు ప్రజా అవమానాలకు గురయ్యారు. విచారణలలో ఈ వర్గం వాళ్లకు మరణశిక్ష విధించారు. ఈ విధంగా ఈ వర్గానికి చెందిన 10-20 లక్షల మందిని చంపి ఉంటారు.

ఆర్థిక సంస్కరణల కార్యక్రమంలో భాగంగా చైనా సాగుభూమిలో 43 శాతాన్ని గ్రామీణ ప్రజలలో 60 శాతానికి పంచిపెట్టడంలో భూసంస్కరణలు విజయం సాధించాయి. పేదరైతుల కింద భూమి గణనీయంగా పెరిగింది. అయితే ముందునుంచి మధ్యతరగతి రైతాంగం బలమైన స్థితిలో ఉన్నందువల్ల అది ఎక్కువ ప్రయోజనం పొందింది.

పాత సంపన్న వర్గానికి చెందిన అధికారం, ఆర్థిక వనరులను తీసేసుకోగా ఇంకోవైపున సిసిపి ద్వారా రాజకీయ రంగంలోకి వచ్చిన పేద, మధ్యతరగతికి చెందిన గ్రామ కార్యకర్తల నుంచి కొత్త కులీన వర్గం ఏర్పడసాగింది. భూ సంస్కరణలతోపాటు రాజకీయ విద్య, అక్షరాస్యతలను వ్యాపింపచెయ్యటానికి పెద్ద ఎత్తున వయోజన రైతాంగ పాఠశాలలను ప్రారంభించారు. దీనితోపాటు గ్రామాల్లోని చిన్న పిల్లలకు, పెద్దవాళ్లకు ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించారు.

- యుద్ధంలో గెలవటానికి సిసిపికి భూ సంస్కరణలు ఎలా దోహదపడ్డాయి?
- భారతదేశంలో అమలు అయిన భూ సంస్కరణలను చైనాలో జరిగిన వాటితో పోల్చండి. వాటి మధ్య పోలికలు, తేడాలను పేర్కొనండి.
- దేశ అభివృద్ధికి, స్వాతంత్ర్యానికి స్త్రీ, పురుషులకు సమాన అవకాశాలు, వాళ్ల సమాన భాగస్వామ్యం అవసరమన్న దృక్పథంతో మీరు ఏకీభవిస్తారా?

విప్లవ తొలి సంవత్సరాలలో భూ సంస్కరణలు అమలుచెయ్యటంలోనూ, అందరికీ ప్రాథమిక విద్యను అందించటంలోనూ సాధించిన విజయాలు చైనా భవిష్యత్తు ప్రగతికి బలమైన పునాదిగా నిలిచాయని మేధావులంతా సాధారణంగా ఏకీభవిస్తారు.

సిసిపి పాలన క్రమేపీ ఏక పార్టీ పాలనకు దారితీసింది. సిసిపికి చెందిన అధినాయకులు, లేదా 'ఛైర్మన్' చాలా శక్తిమంతులుగా ఎదిగారు. ప్రతిపక్ష కార్యకలాపాలు అణగదొక్కబడ్డాయి.

## వియత్నాం : ఇద్దరు వలస పాలకులకు వ్యతిరేకం

### వలసపాలన అనుభవం

19వ శతాబ్ద మధ్యకాలం నాటికి ఫ్రెంచి ప్రత్యక్ష పాలన కిందకి వియత్నాం వచ్చింది. ఫ్రెంచి పాలకులు వియత్నాం చక్రవర్తిని తమ చేతిలో కీలుబొమ్మగా చేసుకుని భారతదేశాన్ని బ్రిటిష్ వాళ్లు పాలించినట్లే పాలించారు. భారతదేశాన్ని బ్రిటన్ ప్రభావితం చేసినట్లే వియత్నామీయుల జీవితాలలో అన్ని అంశాలను ఫ్రెంచి వాళ్లు ప్రభావితం చేశారు.




*పటం 2 : వియత్నాం*

### ఎగుమతులు, భూస్వామ్యవాదం, రైతాంగం

వియత్నాంని వరిని ఎగుమతి చేసే దేశంగా అభివృద్ధి చెయ్యాలని ఫ్రెంచి చాలా ఆసక్తి కనబరిచింది. ఇందుకు అది మూడు ఎత్తుగడలను అనుసరించింది – సాగునీటి సదుపాయాన్ని మెరుగుపరచటం, భూస్వాములను ప్రోత్సహించటం, వరి, రబ్బరు వంటి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కి సహకరించటం. మెకాంగ్ డెల్టా ప్రాంతంలో సాగు విస్తీర్ణాన్ని పెంచటానికి ఫ్రెంచివాళ్లు బీడు భూముల నుంచి నీటిని తోడి కాలవల నిర్మాణం చేపట్టారు. ఈ విస్తృత సాగునీటి పనులలో ముఖ్యంగా కాలవలు, కరకట్ట నిర్మాణంలో బలవంతంగా పనిచేయించి వాటిని పూర్తి చేశారు. దీని ఫలితంగా వరి ఉత్పత్తి పెరిగి అంతర్జాతీయ మార్కెట్లో దానిని ఎగుమతి చెయ్యటం సాధ్యమయ్యింది. వియత్నాం తన వరి ఉత్పత్తిలో మూడింట రెండు వంతులు ఎగుమతి చేయసాగింది. 1931 నాటికి వియత్నాం ప్రపంచంలో మూడవ అతి పెద్ద బియ్యం ఎగుమతిదారుగా ఎదిగింది. దీనితోపాటు వాణిజ్య సరుకుల రవాణా కోసం, సైనిక కేంద్రాలను తరలించటానికి, మొత్తం ప్రాంతాన్ని తమ అదుపులో పెట్టుకోవడానికి మౌలిక సదుపాయాలను (రోడ్లు, రైలు మార్గాల) అభివృద్ధి చేసారు. వియత్నాం ఉత్తర, దక్షిణ ప్రాంతాలను, చైనాను కలిపే ఇండో–చైనా ఖండాంతర రైలుమార్గ నిర్మాణాలను మొదలుపెట్టారు.

వియత్నాం వలసపాలిత ఆర్థిక పరిస్థితి ప్రధానంగా ఫ్రెంచి, కొంతమంది సంపన్న వియత్నామీయుల అధీనంలో ఉన్న వరి ఉత్పత్తి, రబ్బరు సాగుపై ఆధారపడి ఉంది. రబ్బరు తోటలలో వెట్టి కార్మికులను ఉపయోగించుకునేవాళ్లు. ఆర్థిక వ్యవస్థ పారిశ్రామికీకరణ చెందటానికి ఫ్రెంచివాళ్లు ఏమీ చెయ్యలేదు. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్యం పెరిగి పెద్ద పెద్ద భూస్వాములు చిన్న రైతుల భూములను చేజిక్కించుకుని వారితో కౌలు రైతులుగా పని చేయించుకునేవాళ్లు. ఫలితంగా రైతాంగ జీవనప్రమాణం పడిపోయింది.

దశాబ్దాల పాటు సాగిన భూ పరాయీకరణ, ఫ్రెంచివాళ్లకు/ వాళ్ల పక్షాన నిలిచిన వియత్నామీయులకు కొన్ని అంశాలలో మినహాయింపులు ఇవ్వటం వల్ల భూమి పెద్ద, సంపన్న భూస్వాముల చేతుల్లో కేంద్రీకృతం కాసాగింది. భూమి లేకపోవటం, లేదా నామమాత్రంగా ఉండటంతో వియత్నాం రైతాంగం అప్పుల విష వలయంలో చిక్కుకుపోయి బయటపడలేక పోయేది. గ్రామ పెద్దలైన భూస్వాములు విధించే అధిక పన్నులు, అధిక కౌలు, అధిక వడ్డీ భారం కింద రైతాంగం నలిగిపోసాగింది. 1930

నాటికి భూమిలేనితనం, భూ యాజమాన్యానికి సంబంధించిన గణాంకాలు వియత్నాం రైతాంగం ఎదుర్కొంటున్న దారుణ పరిస్థితులను వెల్లడి చేశాయి. అన్నాం అనే ప్రాంతంలో సుమారుగా 53% కుటుంబాలకు అసలు ఏమాత్రం భూమి లేదు. టోన్‌కిన్, కొచిన్‌చినాలో సుమారుగా 58%, 79% కుటుంబాలకు అరంగుళం భూమి కూడా లేదు. 1930లలో భూమి ఉన్న కుటుంబాలలో అత్యధిక శాతం ఆకలికి గురయ్యారంటే భూమిలేని కూలీల పరిస్థితి ఏమిటో ఊహించుకోండి!

- వియత్నాంలో రైలు మార్గాలను, కాలవలను ఫ్రెంచివాళ్లు ఎందుకు అభివృద్ధి చేశారు?
- భూమిలేని రైతాంగానికీ, భూమిలేని కార్మికునికీ మధ్య తేడా ఏమిటి?
- బ్రిటిష్ పాలనలోని భారతదేశ రైతాంగ పరిస్థితి గురించి మీరు చదివారు. వియత్నాం రైతాంగ స్థితికీ, దీనికీ పోలికలు ఏమిటి?

భూస్వాముల నుంచి భూమి తీసుకున్న రైతాంగం దానికి కౌలు చెల్లించటమే కాకుండా భూస్వామి పొలాల్లోనూ, వాళ్ల ఇళ్లలోనూ పని చేయాలి. అంతేకాకుండా వాళ్లు ఇష్టంవచ్చినట్టు విధించే అనేక రకాల పన్నులను కూడా చెల్లించాలి. వీటివల్ల భూస్వాములనుంచి రైతాంగం బియ్యం, డబ్బు అప్పుగా తీసుకోక తప్పేది కాదు. దాంతో వాళ్లు మరింతగా రుణ బంధాలలో కూరుకుపోయేవాళ్లు.

## "నాగరికులుగా చేసే బాధ్యత"

బ్రిటిష్ వాళ్లలాగానే ఫ్రెంచి వలస పాలకులు కూడా వలస పాలిత ప్రజలు అనాగరికులని తమ పాలనతో ఆధునిక నాగరికత ఫలాలను అందించటం తమ కర్తవ్యమని వాళ్లు భావించారు. 'స్థానికులను' నాగరికులుగా చెయ్యటానికి విద్య ఒక మార్గంగా భావించారు. ఫ్రెంచి వాళ్లకు చదువుకున్న కార్మికుల అవసరం ఉంది కానీ విద్య వల్ల సమస్యలు ఉత్పన్నమవుతాయని భయపడసాగారు. ఒకసారి విద్యావంతులైన తరువాత వియత్నామీయులు వలస పాలకుల ఆధిపత్యాన్ని ప్రశ్నించవచ్చు. అంతేకాకుండా వియత్నాంలో ఉంటు ఫ్రెంచి పౌరులు చేస్తున్న టీచర్లు, దుకాణదారులు, పోలీసులు వంటి ఉద్యోగాలను విద్యావంతులైన వియత్నామీయులు లాగేసుకుంటారని భయపడసాగారు. కాబట్టి వీళ్లు వియత్నామీయులకు పూర్తి ఫ్రెంచివిద్యను అందించే విధానాలను వ్యతిరేకించసాగారు. ప్రాథమిక స్థాయిలో వియత్నామీ భాషను నేర్పినప్పటికీ ఉన్నతవిద్య అంతా ఫ్రెంచి భాషలో ఉండేది. జనాభాలో చాలా తక్కువగా ఉన్న వియత్నాం సంపన్నుల పిల్లలు మాత్రమే ఫ్రెంచి బడిలో చేరగలిగేవాళ్లు. అలా బడిలో చేరిన వాళ్లలో చాలా కొద్దిమంది మాత్రమే పాఠశాల విద్య పూర్తి చేసే పరీక్షలో ఉత్తీర్ణులు అయ్యేవాళ్లు. పాఠ్యపుస్తకాలు ఫ్రెంచివాళ్లను పొగుడుతూ, వలసపాలనను సమర్థించేవి.

- భారతదేశంలో బ్రిటిషువాళ్లు అనుసరించిన విధానాన్ని గుర్తుచేసుకోటానికి ప్రయత్నించండి. భారతదేశంలో బ్రిటిషువాళ్లు, వియత్నాంలో ఫ్రెంచివాళ్లు అనుసరించిన వలసపాలన విధానాలను పోల్చండి. వాటి మధ్య పోలికలు, ఏమిటి, తేడాలు ఏమిటి?

## వియత్నాం జాతీయతావాద ఆవిర్భావం

ఫ్రెంచివాళ్లు ఇచ్చిన పాఠ్యాంశాలను టీచర్లు, విద్యార్థులు గుడ్డిగా అనుసరించలేదు. కొన్నిసార్లు దీనిని బహిరంగంగా, కొన్నిసార్లు మౌనంగా నిరసన వ్యక్తం చేసేవారు. కింది తరగతులలో వియత్నాం టీచర్ల సంఖ్య పెరుగుతుండటంతో వారి బోధనను నియంత్రించటం కష్టమైపోయింది. పాఠాలు చెప్పేటప్పుడు వియత్నాం టీచర్లు పాఠాలలో ఉన్నదానిని మార్చి ఫ్రెంచి ప్రభుత్వాన్ని విమర్శించే వారు. కార్యాలయాలలో ఉద్యోగాలకు వియత్నామీయులను అనర్హులుగా చేసేవిధంగా ఉన్న వలస ప్రభుత్వ ప్రయత్నాలను విద్యార్థులు ప్రతిఘటించసాగారు. దేశభక్తి

భావంతో సమాజ ప్రయోజనం కోసం పోరాడటం విద్యావంతుల విధి అన్న నమ్మకంతో వారు ప్రేరణ పొందారు. దీంతో వాళ్ల తమ స్థానానికి ముప్పు వాటిల్లుతుందని భయపడే ఫ్రెంచి పాలకులతోనూ, స్థానిక సంపన్నులతోనూ ఘర్షణ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1920ల నాటికి విద్యార్థులు యువ అన్నాం పార్టీ వంటి రాజకీయ పార్టీలను ఏర్పాటుచేసి 'అన్నామీస్ స్టూడెంట్' వంటి పత్రికలను ప్రచురించసాగారు.

20వ శతాబ్ది ఆరంభంలో ఆధునిక విద్యకోసం వియత్నాం విద్యార్థులు జపాను వెళ్లసాగారు. వాళ్లల్లో చాలామంది ప్రధాన ఉద్దేశం వియత్నాంనుంచి ఫ్రెంచివాళ్లను తరిమెయ్యటం, కీలుబొమ్మ చక్రవర్తిని తొలగించి అంతకుముందు ఫ్రెంచివాళ్లు పడదోసిన ఎన్‌గుయెన్ వంశాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావటం.

చైనాలో సన్ యట్-సేన్ గణతంత్ర విప్లవం సాధించిన తరువాత వియత్నాంలో కూడా గణతంత్ర, ప్రజాస్వామిక పాలనను ఏర్పాటు చేయటానికి అక్కడి ప్రజలు ప్రేరణ పొందారు. చాలామంది విద్యార్థులు ఆ కాలంలో కొత్త రాజకీయ భావాల గురించి తెలుసుకోటానికి చైనా, ఫ్రాన్స్, రష్యా దేశాలకు వెళ్లసాగారు.

### *తిరుగుబాటుదారులుగా మహిళలు*

*వియత్నాం మహిళలు, ప్రత్యేకించి కింది వర్గాల వారు సాంప్రదాయంగా పురుషులతో సమానత్వాన్ని అనుభవించే వాళ్లు. అయితే ప్రజా జీవితంలో వాళ్ల పాత్ర ఉండేది కాదు, తమ భవిష్యత్తును నిర్ణయించుకునే అధికారం ఉండేది కాదు.*

*జాతీయతా ఉద్యమం పెరుగుతున్న తరుణంలో మహిళల హోదా గురించి ఆలోచన మొదలయ్యి స్త్రీతత్వానికి కొత్త రూపు అన్వయించసాగారు. సామాజిక నియమాలను వ్యతిరేకించిన మహిళలను రచయితలు, రాజకీయ మేధావులు కొనియాడసాగారు. 1930లలో నాలిన్ రాసిన నవలలో ఒక మహిళ బలవంతపు పెళ్లి నుంచి బయటకు వచ్చి తనకు నచ్చిన వ్యక్తిని – అతను జాతీయ ఉద్యమంలో పనిచేస్తున్నాడు – పెళ్లి చేసుకుంటుంది. ఈ నవల ఆరోజుల్లో పెద్ద సంచలనం కలిగించింది. సామాజిక నియమాలపై తిరుగుబాటు వియత్నాం సమాజంలో నూతన మహిళ ఆవిర్భావాన్ని సూచిస్తుంది.*

1930ల నాటి ఆర్థిక మాంద్యం వియత్నాంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. రబ్బరు, బియ్యం ధరలు పడిపోయి గ్రామీణ రుణభారం, నిరుద్యోగం పెరిగిపోయాయి. ఫలితంగా గ్రామీణ ప్రజలు తిరుగుబాటు చెయ్యసాగారు. వీటిని ఫ్రెంచివాళ్లు ఉక్కుపాదంతో అణిచివెయ్యసాగారు. నిరసనకారులపై విమానాలతో బాంబులు కూడా వేశారు.

1930 ఫిబ్రవరిలో హో చి మిన్ (అతడు కొన్నాళ్లు ఫ్రాన్స్‌లోనూ, రష్యాలోనూ ఉన్నాడు) పరస్పరం పోటీపడుతున్న జాతీయతా బృందాలను కలిపి వియత్నాం కమ్యూనిస్టు పార్టీ (వియత్నాం కాంగ్ సాన్ డాంగ్)ని ఏర్పాటు చేశాడు. ఆ తరువాత దీని పేరు ఇండో-చైనీస్ కమ్యూనిస్టు పార్టీగా మార్చారు. ఐరోపాలోని కమ్యూనిస్టు పార్టీల మిలిటెంట్ ప్రదర్శనలతో అతడు స్ఫూర్తి పొందాడు.

ఆగ్నేయ ఆసియాపై తన ఆధిపత్యం సాధించాలన్న సామ్రాజ్యవాద కాంక్షలో భాగంగా జపాను 1940లో వియత్నాంను ఆక్రమించింది. దాంతో జాతీయవాదులు ఫ్రెంచివాళ్లనే కాకుండా జపనీయులను కూడా వ్యతిరేకించాల్సి వచ్చింది. అయితే అప్పటికే రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ఫ్రాన్స్ మొత్తాన్ని ఆక్రమించటం వల్ల ఫ్రెంచివారు బలహీనస్థితిలో ఉన్నారు. వియత్నాం స్వాతంత్ర

- బియ్యం ధరలు పడిపోవటంతో గ్రామీణ రుణభారం ఎందుకు పెరిగింది?
- వియత్నాం, చైనాలలో జాతీయతావాదం ఏర్పడటంలో యువత, విద్యార్థులు ముఖ్య పాత్ర పోషించారు. వీటి మధ్య పోలికలు, తేడాలను చర్చించండి.
- స్వతంత్ర వియత్నాం ప్రభుత్వం తీసుకున్న మొదటి చర్యలలో భూమి కౌలు తగ్గించటం ఒకటి. ఈ చర్య ఎందుకు చేపట్టారు?



చిత్రం 15.5 : హోచిమిన్

సమితి – (వియత్‌నాం డాక్ లాప్ డాంగ్ మిన్) దీనిని వియత్‌మిన్‌గా పిలుస్తారు – జపనీయుల ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడి 1945 సెప్టెంబరులో హనాయ్‌ని తిరిగి స్వాధీనం చేసుకుంది. వియత్నాం ప్రజాస్వామ్య గణతంత్రం ఏర్పడింది. హోచిమిన్ దానికి చైర్మన్ అయ్యాడు. 1945 ఆగస్టులో వియత్‌మిన్ అధికారంలోకి వచ్చిన వెంటనే భూమి కౌలును 25 శాతం తగ్గించారు. మారు కౌలుకి ఇవ్వటాన్ని నిషేధించారు. 1945 ఆగస్టు నాటికి ఉన్న కౌలుదార్ల కౌలు బకాయిల మొత్తాన్ని మాఫీ చేశారు. ఉమ్మడి భూమిని, ఫ్రెంచివాళ్ల అధీనంలో ఉన్న భూమిని, వియత్నాం విద్రోహుల భూమిని ప్రజలకు పంచసాగారు.

## వియత్నాంలో నూతన గణతంత్ర వ్యవస్థ

కొత్తగా ఏర్పడిన ఈ గణతంత్ర దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంది. చక్రవర్తి బావో దాయిని కీలుబొమ్మగా చేసి వియత్నాంపై నియంత్రణను తిరిగి సాధించటానికి ఫ్రెంచివాళ్లు ప్రయత్నించారు. ఫ్రెంచి దాడుల నేపథ్యంలో వియత్‌మిన్ సభ్యులు కొండలలో తలదాచుకోవలసి వచ్చింది. ఎనిమిది సంవత్సరాల యుద్ధం తరువాత 1954లో డీన్ బీన్ ఫు వద్ద ఫ్రెంచి ఓడిపోయింది. 16,000 ఫ్రెంచి సైనికులు, అధికారులను యుద్ధ ఖైదీలుగా పట్టుకున్నారు.

ఫ్రెంచివాళ్లు ఓడిపోయిన తరువాత జెనీవాలో జరిగిన శాంతి సంప్రదింపులలో దేశాన్ని రెండుగా విభజించటానికి వియత్నాం ప్రజలను ఒప్పించారు. దేశం ఉత్తర, దక్షిణ భాగాలుగా రెండుగా ఏర్పడింది. హోచిమిన్, కమ్యూనిస్టులు ఉత్తర భాగంలో అధికారానికి వచ్చారు. దక్షిణ భాగానికి పురాతన చక్రవర్తిని అధిపతిగా చేశారు. అయితే అనతికాలంలోనే అతడిని పడదోసి ఎన్‌గో డిన్ డీం అధికారంలోకి వచ్చాడు. అతడు అణచివేత, నియంతృత్వపు ప్రభుత్వాన్ని ఏర్పరిచాడు. అతడిని వ్యతిరేకించిన వాళ్లనందరినీ జైలుపాలు చేశాడు. అతడి నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా "జాతీయ విముక్తి సమాఖ్య" (ఎన్.ఎల్.ఎఫ్.) అనే పేరుతో ప్రజలు పోరాడసాగారు.

- ఇటువంటి భూ సంస్కరణలు వియత్నాం సమాజంపై ఎటువంటి ప్రభావాన్ని చూపి ఉంటాయి? గ్రామీణ ప్రాంతాలలోని వివిధ సామాజిక వర్గాల దృష్ట్యా దీనిని చర్చించండి.
- చైనా, వియత్నాం, భారత దేశాలలోని భూ సంస్కరణల తీరును పోల్చండి.

ఉత్తర వియత్నాంలో ఈ కాలం వరకు భూమికౌలు తగ్గించటం పైన, ఫ్రెంచి లేదా జపనీయుల పక్షాన బహిరంగంగా నిలిచిన భూస్వాముల భూములను మాత్రమే స్వాధీనం చేసుకోవటంపైన దృష్టి పెట్టినందు వలన భూ సంస్కరణల కోసం పట్టు పట్టలేదు. అయితే, 1954 తరువాత ఉత్తర వియత్నాంలో భూసంస్కరణలలో కొత్త యుగం మొదలయ్యింది. భూస్వాముల భూమిని స్వాధీనం చేసుకుని భూమిలేని రైతాంగానికి, పేద రైతులకు భూమిని పంచారు. సొంత భూమి అనే యుగయుగాల రైతుల కలను నిజం చెయ్యటంతో వియత్నాం రైతాంగం పూర్తి మద్దతు వాళ్లకు లభించింది.

## యుద్ధంలోకి దిగిన అమెరికా

ఉత్తర వియత్నాంలోని హోచిమిన్ ప్రభుత్వ సహాయంతో దేశాన్ని ఏకం చెయ్యటానికి ఎన్ ఎల్ ఎఫ్ పోరాడసాగింది. ఈ పరిణామాలతో అమెరికా భయపడసాగింది. కమ్యూనిస్టుల ప్రాబల్యం

## ఏజెంట్ ఆరెంజ్ : అత్యంత విష పదార్థం

*ఏజెంట్ ఆరెంజ్ ఆకులు రాలిపోయేలా చేసి మొక్కల్ని చంపే విషం. నారింజ పట్టీ ఉన్న డ్రమ్ములలో నిల్వ చెయ్యటం వల్ల దానికి ఆ పేరు వచ్చింది. 1961-1971 మధ్య కాలంలో అమెరికా కార్గో యుద్ధ విమానాలు వియత్నాంపై 500 లక్షల లీటర్ల ఈ విషపూరిత రసాయనాన్ని చల్లాయి. అడవులను, పొలాలను నిర్మూలించటం ద్వారా ప్రజలు దాక్కోటానికి అవకాశం లేకుండా చేసి వాళ్లని తేలికగా చంపొచ్చన్నది అమెరికా ప్రణాళిక. దేశంలోని 14 శాతం సాగుభూమి ఈ విషపూరిత రసాయనం వల్ల ప్రభావితం అయ్యింది. దీని ప్రభావం చాలా తీవ్రంగా ఉంది. ఈనాటికి కూడా ప్రజలపై దాని ప్రభావం ఉంది. ఏజెంట్ ఆరెంజ్‌లోని రసాయనిక అంశమైన డైఆక్సిన్ పిల్లల్లో మెదడు దెబ్బతినటానికి, క్యాన్సర్‌కి కారకం. ఈ మందు పిచికారీ చేసిన ప్రాంతాల్లో పిల్లలలో అవయవలో పాలు అధికంగా ఉండటానికి ఈ విషమే కారణమని ఒక అధ్యయనం వెల్లడి చేసింది.*

*రసాయనిక ఆయుధాలతో సహా అమెరికా జోక్యంలో భాగంగా (ప్రధానంగా పౌరులను లక్ష్యంగా చేసుకుని) వియత్నాంపై వేసిన బాంబుల మొత్తం బరువు రెండవ ప్రపంచ యుద్ధకాలం మొత్తంలో కంటే ఎక్కువ.*

పెరుగుతుందన్న ఆందోళనతో సైన్యాన్ని, ఆయుధాలను ఉత్తర వియత్నాంకు పంపించి అది ప్రత్యక్ష జోక్యానికి నిర్ణయించుకుంది.

యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకోవటం వల్ల వియత్నామీయులకే కాకుండా అమెరికాకి కూడా చాలా భారంగా పరిణమించింది. 1965 నుంచి 1972 మధ్య కాలంలో వియత్నాం యుద్ధంలో 34,00,000 అమెరికా సైనికులు పాల్గొన్నారు. అమెరికా వద్ద ఆధునిక సాంకేతిక విజ్ఞానం, చక్కని వైద్య సదుపాయాలు ఉన్నప్పటికీ సైనికుల మరణాలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ యుద్ధకాలంలో మొత్తం 47,244 మంది సైనికులు చనిపోయారు, 3,03,704 మంది గాయపడ్డారు. (ఇలా గాయపడిన వాళ్లలో 23,014 మంది 100 శాతం వైకల్యం పొందిన వాళ్లుగా వెటిరన్స్ అడ్మినిస్ట్రేషన్ పేర్కొంది.)

అమెరికాతో జరిగిన ఈ యుద్ధకాలం చాలా దారుణమైనది. వేలాది అమెరికా సైనికులు శక్తిమంతమైన ఆయుధాలు, యుద్ధ ట్యాంకులతో వచ్చేవాళ్లు, వాళ్లకి అండగా ఆనాటికి అత్యంత శక్తిమంతమైన వైమానిక బాంబర్లు అయిన బి52 విమానాలు ఉండేవి. పెద్ద ఎత్తున సాగిన దాడులు, రసాయనిక ఆయుధాల వినియోగంతో - నాపాలం





*చిత్రం 15.6 : (అ) అడవుల మీద విష రసాయనికాలను చల్లుతున్న అమెరికా యుద్ధ విమానాలు, (ఆ) ఈ బొమ్మకు అసలు వ్యాఖ్య: "ప్రతిదానికీ ఒక ఉపయోగం." ఈ బొమ్మలో ఒక అమ్మాయి డ్రమ్ముని దొర్లించుకుంటూ వెళుతోంది. ఈ లోహాన్ని చిన్న డబ్బాలు, గరిటెలు తయారు చెయ్యటానికి ఉపయోగిస్తారు.*

(మనుషులకు తీవ్ర నష్టం కలిగించే ప్రమాదకరమైన బాంబు), ఏజెంట్ ఆరెంజ్ (ఇది చెట్లు, మొక్కలను చంపేసి భూమిని చాలా సంవత్సరాలపాటు బీడుగా మార్చింది), భాస్వరం బాంబులతో అనేక గ్రామాలు విధ్వంసమయ్యాయి, అడవులు నాశనమైపోయాయి. పెద్ద సంఖ్యలో పౌరులు చనిపోయారు.

ప్రతిఘటనకి, ఇళ్లు, కుటుంబాలను త్యాగం చెయ్యటానికి, దారుణ పరిస్థితులలో జీవించటానికి, స్వాతంత్రం కోసం పోరాడటానికి వీలుగా ప్రజలకు జాతీయతాభావం ఇచ్చే ప్రేరణను అమెరికా విధానకర్తలు తక్కువ అంచనా వేశారు. ప్రపంచంలోకెల్లా అత్యంత ఆధునిక సాంకేతిక విజ్ఞానం ఉన్న అభివృద్ధి చెందిన దేశాన్ని ప్రతిఘటించటంలో ఒక చిన్న దేశానికి ఉండే శక్తిని అంచనా వెయ్యటంలో వాళ్లు పొరబడ్డారు. భూస్వాముల చేతులలో తరాలపాటు దోపిడీకి గురయ్యి ఇటీవలే కొంత భూమిని పొందిన లక్షలాది పేద రైతాంగ నిబద్ధతని వారు తక్కువ అంచనా వేశారు. జాతీయతాభావంతో ప్రేరణ పొంది, భూ సంస్కరణలతో ఉత్సాహం పొందిన ఈ పేద రైతాంగం ప్రపంచంలోకెల్లా మేటి సైన్యాన్ని ఓడించటంలో కీలకపాత్ర పోషించింది.


- పౌరులపైన, అడవుల మీద నాపాలం, ఏజెంట్ ఆరెంజ్ వంటి రసాయనిక ఆయుధాలను అమెరికా ఉపయోగించటం సరైనదేనా?
- అమెరికా అంతటి బలమైన దేశాన్ని వియత్నాం వంటి చిన్న దేశం ఎలా ఎదిరించగలిగింది?
- వియత్నాం నుంచి అమెరికా ప్రభుత్వం విరమించుకోవటంలో ఆ దేశంలోని శాంతి ఉద్యమం పాత్ర ఏమిటి?

ఈ యుద్ధ ప్రభావం అమెరికాపై సైతం పడింది. తనకు సంబంధంలేని యుద్ధంలో జోక్యం చేసుకున్నందుకు ప్రభుత్వాన్ని చాలామంది విమర్శించారు. యుద్ధం కోసం యువతను సైన్యంలోకి తీసుకోవటంతో అక్కడ వ్యతిరేకత ఇంకా పెరిగింది. యుద్ధం దీర్ఘకాలం కొనసాగటంతో అమెరికాలో దాని పట్ల బలమైన నిరసనలు వెల్లువెత్తసాగాయి. ప్రభుత్వ విధానాన్ని సర్వత్రా ప్రశ్నించటంతో అంతిమంగా యుద్ధ ముగింపు సంప్రదింపులు చేపట్టేలా చేసింది. 1974 జనవరిలో పారిస్‌లో శాంతి ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో అమెరికాతో యుద్ధం ముగిసింది. అయితే సైగాన్ ప్రభుత్వం, ఎన్‌ఎల్‌ఎఫ్ మధ్య ఘర్షణ ఇంకా కొనసాగింది. 1975 ఏప్రిల్ 30న జాతీయ విముక్తి సమాఖ్య (ఎన్‌ఎల్‌ఎఫ్) సైగాన్‌లోని అధ్యక్ష భవనాన్ని స్వాధీనం చేసుకుని అంతిమంగా వియత్నాంలను ఒకటిగా చేశారు.

## నైజీరియా : వలస పాలకులకు వ్యతిరేకంగా ఏకం కావటం

ఇప్పుడు ఆఫ్రికాలోని వలసపాలన, జాతీయతావాదాల గురించి తెలుసుకోటానికి ఆ ఖండ పశ్చిమ తీరాన ఉన్న నైజీరియాను అధ్యయనం చేద్దాం. ఈ దేశాన్ని పటంలో గుర్తించండి. ఈ దేశం గురించి ఎనిమిదవ తరగతిలో చదివినది గుర్తు చేసుకోండి.

పటం 3 : నైజీరియా పటం




### బ్రిటిష్ వలసపాలన, ఒక జాతి ఏర్పాటు

ప్రపంచంలో మిగిలిన ప్రాంతాల్లో మాదిరిగానే ఆఫ్రికాలో కూడా జాతీయ రాజ్యాలు అన్న భావన కొత్తది. తరచుగా గిరిజన తెగల ఉనికి గుర్తింపు సాధారణంగా ప్రజలను ఒకటిగా ఉంచేది. వలస పాలకులు కొంత ప్రాంతాన్ని ఇష్టానుసారంగా తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ప్రస్తుతం నైజీరియాగా మనకు తెలిసిన దేశాన్ని బ్రిటిషువారు ఏర్పరిచారు. నైజర్ నదీ వ్యవస్థ కింద వివిధ తెగలు

ఉంటున్న వేరు వేరు ప్రాంతాలను ఒకటిగా చెయ్యటం ద్వారా దీనిని ఏర్పరిచారు. ఉత్తర నైజీరియాలో హౌసా-ఫులాని ప్రజలు అధికంగా ఉన్నారు. వీరు ముఖ్యంగా ముస్లిములు. ఆగ్నేయ నైజీరియాలో ఈబో తెగ, నైరుతి భాగంలో యొరుబా తెగల ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారు. అనేక సంవత్సరాల మిషనరీల ప్రచార కారణంగా దక్షిణ ప్రాంతాలలో క్రైస్తవ మతస్తులు అధిక సంఖ్యలో ఉన్నారు. అయినప్పటికీ గిరిజన మత నమ్మకాలు ఉన్నవాళ్లు కూడా ఎక్కువ గానే ఉన్నారు. ఈ మూడు ప్రాంతాల మధ్య ఘర్షణలు, ఉమ్మడి ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థను ఏర్పరచాలన్న ప్రయత్నాలతో ఆధునిక నైజీరియా కథ నిండి ఉంది. ఆ దేశ సహజ వనరులపై, ప్రత్యేకించి చమురుపై యూరపు నియంత్రణతో వలస పాలన వారసత్వం ఇంకా కొనసాగుతూనే ఉంది.

ఆఫ్రికాలో అధిక జనాభా సాంద్రతగల దేశాలలో నైజర్‌నదీ ప్రాంతం ఒకటి. ఇది అనేక రకాల వలస పాలనతో దోపిడీకి గురయ్యింది. 16వ శతాబ్దం నాటినుంచి అమెరికాకు బానిసలను సరఫరా చెయ్యటంలో ఇది ప్రధాన కేంద్రంగా ఉండింది. ఆఫ్రికా లోపలినుంచి రైతాంగ గిరిజనులను పట్టుకుని ఐరోపా బానిస వర్తకులకు అమ్మేవాళ్లు. 19వ శతాబ్దంలో బానిసల వ్యాపారాన్ని నిషేధించటంతో ఈ ప్రాంతంలోని వ్యవసాయ ఉత్పత్తులు, ప్రత్యేకించి కోకో, పామాయిల్ పట్ల వలస పాలకుల ఆసక్తి పెరిగింది. తీరప్రాంతాలపై 1861లో బ్రిటన్ తన పాలనను ఏర్పాటుచేసింది. పశ్చిమ ఆఫ్రికాలోని లాగోస్‌ని విద్య, వ్యాపారం, పరిపాలనలకు ప్రధాన కేంద్రంగా రూపు దిద్దింది. అది వలస పాలనపై వ్యతిరేకతకు, నైజీరియా జాతీయతావాదానికి, ఖండాంతర ఆఫ్రికా వాదానికి కూడా కేంద్రంగా ఉంది.

19వ శతాబ్దం చివర, 20వ శతాబ్దం ఆరంభంలో బ్రిటిష్ వలస సామ్రాజ్యంలో జాత్యాహంకారం తిరిగి చోటు చేసుకుంది. విద్యావంతులైన ఆఫ్రికా వాసులను సివిల్ సేవలకు అనుమతించలేదు, ఆఫ్రికా వ్యాపారవేత్తల పట్ల వివక్షత చూపేవాళ్లు. అదే సమయంలో ప్రజలపై మరింత నియంత్రణను సాధించటానికి వీలుగా గిరిజన తెగ నాయకులు, సంపన్నులతో సంబంధాలు నెరిపింది.

వలసపాలకుల విధానాల వల్ల దక్షిణ ప్రాంతంలో ఆధునిక విద్యకు, పరిపాలన ఆధునీకరణకు ప్రోత్సాహం లభించగా ఉత్తర ప్రాంతంలో పూర్వ సాంప్రదాయాలు కొనసాగాయి. ఫలితంగా 20వ శతాబ్దం చివరినాటికి ప్రాంతీయ అసమానతలు పెరిగాయి, ఉత్తర ప్రాంతం ఆధునిక విద్యను పొందిన సామాజిక వర్గాన్ని ఏర్పరుచుకోలేకపోయింది. 1939లో బ్రిటిష్ పాలకులు పశ్చిమ, తూర్పు నైజీరియా ప్రాంతాలను ఏర్పరిచి యొరుబా, ఈబు తెగల మధ్య కూడా విభజనలు సృష్టించారు. ఆ విధంగా 'విభజించి, పాలించు' అన్న సిద్ధాంతానికి అనుగుణంగా మూడు ప్రధాన గిరిజన తెగల మధ్య పోటీని, ఘర్షణని ప్రోత్సహించారు.

దీనిని వ్యతిరేకిస్తూ పాశ్చాత్య విద్య పొందిన కొంతమంది మేధావులు ఉమ్మడి నైజీరియా దేశం అన్న భావనను కలిగించి బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడసాగారు. నైజీరియాలో మొదటి రాజకీయ పార్టీయైన నైజీరియా జాతీయ ప్రజాస్వామిక పార్టీ (ఎన్ ఎన్ డి పి) ని 1923లో హెర్బెర్ట్ మకాలే స్థాపించాడు. 1923, 1928, 1933లో జరిగిన ఎన్నికలలో ఎన్ ఎన్ డి పి అన్ని స్థానాలనూ గెలుచుకుంది. 1930లలో బ్రిటిష్ వలస ప్రభుత్వంపై తీవ్రవాద దాడులను కూడా మకాలే సమర్థించాడు. 1936లో ఎన్ నంది అజికివె అనే

**ఖండాంతర ఆఫ్రికావాదం**

దేశ, తెగ తేడాలు లేకుండా ఆఫ్రికా ప్రజలందరినీ ఒకటిగా చెయ్యటానికి ఖండాంతర ఆఫ్రికావాదం ప్రయయత్నిస్తుంది. ఈ ఐకమత్యంతో వలసపాలనను, జాతి వివక్షతను వ్యతిరేకించటమే కాకుండా సమానత్వం, సామాజిక న్యాయం, మానవ గౌరవం అన్న సూత్రాల ఆధారంగా ఆఫ్రికా ఖండంలోని అన్ని తెగలు, ప్రజల సమూహాల మధ్య ఐకమత్యం సాధించటానికి ప్రయత్నించింది. ఘనా స్వాతంత్ర యోధుడు క్వామె న్క్రుమా దీంట్లో ప్రముఖపాత్ర పోషించాడు.

వ్యక్తి "నైజీరియా యువ ఉద్యమాన్ని" (ఎన్ వై ఎం) స్థాపించాడు. సాంస్కృతిక నేపథ్యంతో సంబంధం లేకుండా నైజీరియా ప్రజలందరినీ అది ఆకర్షించసాగి అనతికాలంలోనే అది బలమైన రాజకీయ ఉద్యమంగా ఎదిగింది. 1944లో మకాలే, ఎన్ వై ఎం నాయకుడు ఎన్ నంది అజికివె కలిసి నైజీరియా, కామెరూన్‌ల జాతీయ సంఘాన్ని (ఎన్‌సిఎన్‌సి) ఏర్పరచటానికి అంగీకారానికి వచ్చారు. క్రమేపీ ఎన్ నంది అజికివె ప్రముఖ జాతీయ నాయకుడిగా ఎదిగాడు. ఖండాంతర ఆఫ్రికావాదం, ఖండాంతర నైజీరియావాదం ఆధారిత జాతీయ ఉద్యమానికి అతడు మద్దతు తెలిపాడు.



చిత్రం 15.7: ఎన్ నంది అజికివె

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత నైజీరియా ఆర్థిక పరిస్థితి కష్టాలకు లోనవటంతో నైజీరియా జాతీయతావాదం తీవ్రవాద భావాలకు గురయ్యి దానికి ప్రజల ఆదరణ పెరిగి బలం పుంజుకోసాగింది. రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ తరఫున పోరాడి తిరిగి వచ్చిన సైనికులు, కార్మిక సంఘ నాయకులు ఈ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారు. 1945లో అతివాద జాతీయతావాద కార్మిక సంఘ నాయకుల ఆధ్వర్యంలో జాతీయ సాధారణ సమ్మె నిర్వహించారు.

- జాతీయతావాదానికీ, ఖండాంతర ఆఫ్రికా భావానికి మధ్య తేడాలు ఏమిటో చర్చించండి. జాతీయతావాదం అన్నది పరిమితమైన భావమా?
- ఒక శతాబ్ద కాల వలసపాలన వల్ల ప్రాంతాల మధ్య అసమానతలు నెలకొన్నాయి. భారతదేశంలో కూడా బ్రిటిష్ పాలనలో కోస్తా ప్రాంతాలైన బెంగాలు, మద్రాసు, బొంబాయి వంటివి వేగంగా అభివృద్ధి చెందాయి. అభివృద్ధిలో ఇలా అసమానతలు ఎందుకు చోటు చేసుకుంటాయి?

నైజీరియా జాతీయతా వాదం ముందు రెండు కర్తవ్యాలు ఉన్నాయి: బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడటం; ఘర్షణ పడుతున్న వివిధ తెగల మధ్య ఐకమత్యాన్ని సాధించటం. ఉత్తర ప్రాంతంలో కంటే బాగా అభివృద్ధి చెందిన దక్షిణ ప్రాంతంలో జాతీయ ఉద్యమం బాగా బలంగా ఉండటంతో ఉత్తర–దక్షిణ ప్రాంతాల మధ్య తేడాలు పొడసూపసాగాయి. దక్షిణ ప్రాంతంలో కూడా యొరుబా, ఈబూ తెగల మధ్య ఘర్షణలు జాతీయ ఉద్యమాన్ని పీడించసాగాయి. 1950ల నాటికి ఈ మూడు ప్రాంతాలలో వలసపాలనను వ్యతిరేకిస్తూ మూడు ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయి: ఉత్తర ప్రాంతంలో "సాంప్రదాయ భావాలతో కూడిన ఉత్తర ప్రజల కాంగ్రెస్" (ఎన్‌పిసి), తూర్పు ప్రాంతంలో "నైజీరియా, కెమరూన్ల జాతీయ సంఘం" (ఎన్‌సిఎన్‌సి), పశ్చిమ ప్రాంతంలో యాక్షన్ గ్రూపు (ఎజి).

## స్వాతంత్ర్యం, బలహీన ప్రజాస్వామ్యం

జాతీయ ఉద్యమ తీవ్రతను గుర్తించిన బ్రిటిష్ పాలకులు నైజీరియన్లకు అధికారాన్ని అప్పగించాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు మూడు ప్రధాన ప్రాంతాల స్వయంప్రతిపత్తిని గుర్తిస్తూ సంక్లిష్ట సమాఖ్య వ్యవస్థను నెలకొల్పారు. 1963 అక్టోబరు 1న నైజీరియా స్వాతంత్ర్యం పొందింది. దురదృష్టవశాత్తు ప్రజాస్వామిక, న్యాయపూరిత సమతుల్యం సాధించలేకపోవటం వల్ల అనతికాలంలోనే నైజీరియాలో పౌర యుద్ధం చెలరేగింది. ఫలితంగా సైనిక పాలన ఏర్పడింది. ఉత్తర ప్రాంత ఆధిపత్య ధోరణిని ఇది

కొనసాగించింది. పౌర, ప్రజాస్వామిక ప్రభుత్వాలను ఏర్పాటు చెయ్యటానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి కానీ ఇవన్నీ విఫలమయ్యాయి. సైనిక పాలనలో అవినీతి, మానవ హక్కుల ఉల్లంఘన కొనసాగాయి. అవినీతి పాలకులకు మద్దతు ఇచ్చే బహుళజాతి చమురు కంపెనీలు, సైనిక ప్రభుత్వాలు దీంట్లో భాగస్వామ్యం అయ్యాయి.


చిత్రం 15.8: బైఫారియన్ యుద్ధం

సుదీర్ఘ సైనిక నియంతృత్వ పాలన తరువాత 1999లో నైజీరియా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఎన్నుకుంది. ప్రజాస్వామిక నైజీరియాను నిర్మించే సవాలును ఇది ఎట్లా ఎదుర్కొంటుందో వేచి చూడాల్సి ఉంది.

## చమురు, పర్యావరణం, రాజకీయాలు

నైజర్ డెల్టాలో 1950లలో చమురును కనుగొన్నారు. ఈ చమురును వెలికితీసే హక్కులను డచ్ షెల్ కంపెనీ నేతృత్వంలోని వివిధ బహుళజాతి కంపెనీలు పొందాయి. ప్రస్తుతం ఇది నైజీరియాకి ముఖ్యమైన వనరు. చమురు బావులలో అనేకం బహుళజాతి సంస్థల అధీనంలో ఉన్నాయి. ఇవి చమురుని వెలికితీసి తమ లాభాల్లో కొంత శాతాన్ని సైనిక పాలకులతో పంచుకున్నాయి. సాధారణ ప్రజలకు దీనివల్ల ఎటువంటి ప్రయోజనమూ ఒనగూడలేదు. అంతేకాదు విదేశీ చమురు కంపెనీలు పర్యావరణాన్ని పట్టించుకోకుండా యథేచ్ఛగా చమురును వెలికి తీయటం వల్ల తీరప్రాంత వాతావరణంలో అనేక సమస్యలు ఏర్పడ్డాయి. చమురు బావుల నుంచి సముద్రపు నీటిలో కలిసే చమురు వల్ల ఇక్కడి జీవావరణ వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమయ్యింది. ప్రత్యేకించి మడ అడవులు చమురుకి తట్టుకోలేవు. ఈ చమురు నేలలోకి ఇంకి ప్రతి సంవత్సరం ముంపుకి గురైనప్పుడు తిరిగి నీటిపైకిరావటం వల్ల చాలా విస్తీర్ణంలో మడ అడవులు అంతరించిపోయాయి. నైజీరియాలోని మడ అడవులు జీవావరణ వ్యవస్థలో 5-10 శాతం వరకు నరికివెయ్యబడటం వల్లగానీ, చమురు ఊటల వల్లగానీ నష్టపోయాయని అంచనా. ఈ చమురు వల్ల నేలలు, భూగర్భజలాలు కలుషితమయ్యి పంటలు, చేపల పెంపకం వంటివి దెబ్బతింటున్నాయి. తాగునీరు కూడా తరచు కలుషితమవుతున్నాయి. స్థానిక నీటి మడుగులలో పలచటి నూనె జిడ్డు కనపడుతుంటుంది. తాగునీళ్లు కలుషితం కావటంతో ఆరోగ్యంపై వెంటనే ప్రభావం కనపడకపోయినప్పటికీ, దీర్ఘకాలంలో క్యాన్సర్ వంటి సమస్యలు ఏర్పడవచ్చు. సముద్ర జలాల్లో చమురు ఊటలు చాలా ఎక్కువగా ఉండి, తీరప్రాంత పర్యావరణం ప్రభావితమయ్యి స్థానికంగా చేపల ఉత్పత్తి పడిపోతుంది.


చిత్రం 15.9: చమురుతో కలుషితమైన జలాలు


చిత్రం 15.10: కెన్ సారో వివా

- నైజీరియాలోని చమురు వనరులలో అధిక భాగం ఆగ్నేయ భాగంలో ఉన్నాయి. చమురు లాభాలలోని అధిక భాగం తమకు చెందాలని ఈబూలు భావిస్తారు. చమురు సంపదతో ఉత్తర ప్రాంతాన్ని అభివృద్ధి చెయ్యటాన్ని వాళ్లు వ్యతిరేకిస్తున్నారు. ఈ సమస్యకు సరైన, న్యాయపూరితమైన పరిష్కారం ఏమిటి?

1990ల కాలంలో ప్రత్యేకించి నైజర్ డెల్టా ప్రాంతంలో ప్రజల ఆందోళన క్రమేపీ పెరగసాగింది. స్థానిక గిరిజన తెగలు సంవత్సరాల తరబడి జరిగిన జీవావరణ నష్టానికి పరిహారం చెల్లించాలని, తమ ప్రాంతంలోని చమురు వనరులపై తమకు నియంత్రణ కావాలని పోరాడసాగాయి. ఈ ఆందోళన మొదట జాతి ఆధారంగా సభ్యులలో ఐకమత్యం సాధించి శాంతియుతంగా ఉన్నది. ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త, పర్యావరణవాది అయిన కెన్ సారో వివాని అంతర్జాతీయ నిరసనల మధ్య మిలటరీ ప్రభుత్వం మరణశిక్ష వెయ్యటంతో పరిస్థితులు తీవ్రరూపం దాల్చాయి.

ఒక జాతిగా ఏర్పడటానికి, సుస్థిర ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించటానికి, తన భౌతిక వనరులపై నియంత్రణను సాధించటానికి నైజీరియా ఇంకా ప్రయత్నాలు చేస్తూనే ఉంది.

## కీలక పదాలు

| | | | |
|---|---|---|---|
| భూ సంస్కరణలు | భూస్వామ్యవాదం | నూతన ప్రజాస్వామ్యం | వెట్టి కార్మికులు |
| రసాయనిక ఆయుధాలు | బలహీన ప్రజాస్వామ్యం | ఖండాంతర ఆఫ్రికా వాదం | |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. కింది వాటిని జతపరచండి

| | |
|---|---|
| ● సన్‌యట్-సెన్ | దేశాన్ని సైనిక దేశం చేశాడు |
| ● చియాంగ్ కైషేక్ | పర్యావరణ ఉద్యమం |
| ● మావో జెడాంగ్ | జాతీయతావాదం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం |
| ● కెన్ సారో వివా | రైతాంగ విప్లవం |

2. దశాబ్దాల కాలంలో చైనాలో మహిళల పాత్రలో వచ్చిన మార్పులను గుర్తించండి. రష్యా, జర్మనీలో సంభవించిన మార్పులకూ, వీటికీ తేడాలు, పోలికలు ఏమిటి?
3. రాచరిక పాలనను పడదోసిన తరువాత చైనాలో రెండు రకాల పాలనలు ఏర్పడ్డాయి. వీటి మధ్య పోలికలు, తేడాలు ఏమిటి?
4. ఈ అధ్యాయంలో చర్చించిన దేశాలన్నీ ప్రధానంగా వ్యవసాయం పైన ఆధారపడినవే. అందులోని పద్ధతులు మార్చటానికి ఈ దేశాలలో ఎటువంటి ప్రయత్నాలు జరిగాయి?
5. పైన చర్చించిన దేశాలలో పరిశ్రమలు ఎవరి అధీనంలో ఉన్నాయి? ఈ పద్ధతులను మార్చటానికి ఎటువంటి ప్రయత్నాలు జరిగాయి. పోల్చటానికి ఒక పట్టికను తయారుచెయ్యండి.
6. భారతదేశం, నైజీరియాలలోని జాతీయ ఉద్యమాలను పోల్చండి. భారతదేశంలో ఇది ఎందుకు బలంగా ఉండింది?
7. స్వతంత్ర నైజీరియా దేశం ఎదుర్కొన్న సవాళ్లు ఏమిటి? స్వతంత్ర భారతదేశం ఎదుర్కొన్న సవాళ్లతో పోలికలు, తేడాలు ఏమిటి?
8. భారతదేశం, వియత్నాంల లాగా స్వాతంత్ర్యం కోసం నైజీరియా మరీ అంత కష్టపడాల్సి రాలేదు. దీనికి కొన్ని కారణాలను పేర్కొనండి.
9. పైన చర్చించిన దేశాలలోని జాతీయ ఉద్యమాలలో పాఠశాల విద్య పాత్ర ఏమిటి?
10. ఈ దేశాల స్వాతంత్ర్య పోరాటాలలో పాలకులపై యుద్ధాలు చేశారు. వాటి ప్రభావాన్ని క్లుప్తంగా వివరించండి.